బూత్ ఇన్‌చార్జిలకు సత్కారం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: టీడీపీ క్రియాశీలక సభ్యత్వాలలో భాగంగా 75వ వార్డు బూత్‌లలో సభ్యత్వం చురుకుగా సాగుతుంది. అందులో భాగంగా ముందుగా వారి వారి బూత్‌లలో 300 పైబడి క్రియాశీలక సభ్యత్వాలు చేయించిన టీడీపీ సీనియర్ నాయకులు ములకలపల్లి పెంటయ్య, నమ్మి పుష్పలత, ఊరుకుటి అప్పల రాజులను 75వ వార్డ్ కార్పొరేటర్ దంపతులు పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి టీడీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్, టేకేటీ అప్పారావు, మొల్లి అప్పారావు, కేతా మురళి, దొమ్మేటి సోము నాయుడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారంపై మోడీ స్పష్టమైన ప్రకటన చేయకపోవడం దుర్మార్గం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: విశాఖ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోడీ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని స్పష్టమైన ప్రకటన చేయక పోవడం దుర్మార్గమని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ విమర్శించారు. సీపీఐ గాజువాక నియోజక వర్గ సమితి ఆధ్వర్యంలో పెదగంట్యాడ కూడలిలో భారీ ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలుత పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్ వద్ద నుంచి పెద గంట్యాడ కూడలి వరకు సీపీఐ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆదినారా యణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 8న విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని స్పష్టమైన ప్రకటన చేయక పోవడం దుర్మార్గమని విమర్శించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని సుమారు నాలుగేళ్లుగా కార్మిక వర్గం ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం అనాలోచిత నిర్ణయాల వల్ల గత నాలుగు నెలలుగా ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని అన్నారు. తక్షణమే ఉక్కు యాజమాన్యం ఉద్యోగులకు పెండింగ్ జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ గాజువాక నియోజక వర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక కార్మిక వర్గంపై దాడి పెరిగిందన్నారు.

ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడంలో భాగమే విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ అని అన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో సీపీఐ నాయకులు జె.రామకృష్ణ, జి.ఆనంద్, కె.అచ్యుత రావు, యెల్లెటి శ్రీనివాస్, తాండ్ర కనక రాజు, కె.రాజ బాబు, పి.దుర్గారావు, కె.పోతయ్య, పల్లేటి పోలయ్య, ఏ.మసేన్‌రావు, మహిళా సమాఖ్య నేతలు కె.వనజాక్షి, పి.పద్మ పాల్గొన్నారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగర ప్రజలకు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలను శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారురివురు మాట్లాడుతూ తెలుగువారు ఎంతో సంప్రదాయంగా జరుపుకునే పండుగలలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలని, ఈ పర్వదినాలలో నగర ప్రజలందరూ సుఖ సంతో షాలతో, ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు.

వీపీఏను సందర్శించిన ఐఏఎస్ ట్రైనీ అధికారులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఐఏఎస్ ట్రైనీ అధికారుల బృందం తమ వింటర్ స్టడీ టూర్‌లో భాగంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)ని శనివారం సందర్శించింది. పోర్ట్ ఉన్నతాధికారులు, ట్రైనీ అధికారులకు ఆత్మీయ స్వాగతం పలికారు. పోర్ట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు ట్రైనీ అధికారులకు వివరించారు. ప్రధానంగా మౌలిక వసతులు, కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం, ఆధునీకరణ, మెకనై జేషన్ ప్రాజెక్టులు, కవర్డ్ స్టోరేజ్ సౌకర్యాలు, సోలార్ పవర్ ప్లాంట్, పరిశ్రమల కోసం ఎస్టీపీ ద్వారా నీటి శుద్ధి విస్తృత పెట్టుబడి అవకాశాలు, అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్, ట్రక్ పార్కింగ్ టెర్మినల్, దిగుమతులు, ఎగుమతుల అవకాశాలను మెరుగుపరిచే మార్గాలు వంటి అంశాలను ట్రైనీ బృందానికి పోర్ట్ అధికారులు వివరించారు. వీపీఏ అధికారులు ఇచ్చిన ఆతిథ్యానికి పోర్ట్ కార్యకలాపాలు వివరించిన విధానంపై ట్రైనీ ఐఏఎస్ బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమానికి పోర్ట్ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు.

బెహరాలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: ప్రతీ ఒక్కరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని, ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానంలో ఉండాలని బెహరా విద్యాసంస్థల సెక్రటరీ డా. బెహరా చైతన్య అన్నారు. ముందుగా బెహరా విద్యా సంస్థల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ తెలుగుతనం ఉట్టిపడే ఈ సంక్రాంతి పండగ ప్రతీ కుటుంబంలో వెలుగులు నింపాలని ఆ భగవంతుణ్ణి కోరుకున్నానని అన్నారు. తెలుగింటి సాంప్రదాయానికి సంక్రాంతి పండుగ రంగు రంగుల గాలి పటాలతో, డూ డూ బసవన్నలతో, సాంప్రదాయ దుస్తులతో స్వాగతం పలుకుతుందని అన్నారు. ఈ సంబరాల్లో నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ తరుణ్, ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ డా. శ్రీధర్ పట్నాయక్, నర్సింగ్ ప్రిన్సిపల్ డా. హిందుమతి, వరలక్ష్మి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్స్ సుకన్య, అనీల్, ఐటిఐ ప్రిన్సిపల్ హరి కృష్ణ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల అభివృద్దే లక్ష్యం

కార్పొరేటర్ మొల్లి హేమలత

విశాలాంధ్ర - మధురవాడ/పీఎంపాలెం: జీవీఎంసీ 5వ వార్డు మధురవాడ కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీలలో మెట్లమార్గాలు, రోడ్లు, కాలువల పనులకు శనివారం ఆ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత భూమిపూజ చేశారు. 5వ వార్డు పరిధిలో గల కొండవాలు ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, స్వయంకృషి నగర్ తదితర ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సుమారు 60 లక్షల నిధులతో పైపులైన్లు వేయడం జరుగుతుందని, తొందరలోనే ఆ పని పూర్తయి ప్రజలందరికీ త్రాగునీరు అందిస్తామని తెలిపారు. ఇంకా వార్డులో సాయిరాం కాలనీ, శారద నగర్, శివశక్తి నగర్ తదితర కొండవాలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు మెట్లు మార్గాలు వేయవలసి ఉందని అవి కూడా దశలవారీగా తొందరలోనే పూర్తి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, వార్డ్ అధ్యక్షులు నాగోతి వెంకట సత్యన్నారాయణ, నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను, ప్రధాన కార్యదర్శి ఈగల రవికుమార్, పోతిన అప్పారావు, సూర్య, శ్రావణి, సతీష్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బాసర కాలేజీపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - భీమిలి: కాలేజీ బస్సు క్రింద పడి చనిపోయిన బాసర కాలేజీ విద్యార్థిని భరణి మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. అక్కడికి చేరుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు విలపిస్తున్న తల్లిదండ్రులను పరామర్శించి బాసర కాలేజిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారికి విన్నవించారు. ఎస్.ఎఫ్.ఐ భీమిలి జోన్ కార్యదర్శి కె.తేజ శ్రీ మాట్లాడుతూ పండగ సెలవుల్లో కూడా కాలేజీ నిర్వహించి విద్యార్థిని భరణి మృతికి కారణమైన తగరపువలస బాసర కాలేజీపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పండగ సెలవులు ప్రకటించినా సరే కాలేజీలో పరీక్షల పేరుతో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వలన ఇటువంటి దుర్ఘటనలు జరుగుతు న్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.సాయి తేజ, శ్రీనివాస్, చాందినీ, వాసవి పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - మల్కాపురం: భారత సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో సంక్రాంతి పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ కేస్లీన్ మాట్లాడుతూ సంస్కృతీ సాంప్రదాయాలను ముందు తరాలకు తీసుకు వెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన అందరినీ అభినందించారు. సంబరాల్లో భాగంగా కళాశాల మొత్తం రంగవల్లులతో, రకరకాల అలంకరణలతో శోభాయమానంగా కనిపించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భోగిమంట అందరిని ఆకర్షించింది. రంగవల్లుల చుట్టూ విద్యార్థినులు, అధ్యాపకులు నృత్యం చేస్తూ పండగ వాతావరణాన్ని ద్విగుణీకృతం చేశారు. పండగ విశిష్టతను గురించి పలువురు అధ్యాపకులు ప్రసంగించారు.

గోస్తనీ విద్యాపీఠ్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం గోస్తనీ విద్యా పీఠ్ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోస్తనీ విద్యాపీఠ్ వ్యవస్థాపకులు సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు కే.ఎర్రి నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంక్రాంతి సంబరాలలో రంగుల పోటీలు, ఉట్టి కొట్టడం, భోగి మంటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాల వ్యవస్థాపకులు కే.సూరిబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండగ గురించి పిల్లలకు వివరించారు. సంక్రాంతి పండుగ అనేది భారతీయ సాంప్రదాయాల్లో ప్రథమ భాగమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ.59 కోట్ల విలువ చేసే భూమి స్వాధీనం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానంకు చెందిన వేపగుంట గ్రామం సర్వే నెంబర్ 181లో ఎ.03.40సెంట్లు భూమిని ఈఓ వి.త్రినాధరావు, దేవస్థానం భూ విభాగ లీగల్ అధికారి బృందం కోర్టు ఉత్తర్వులు ప్రకారం ఆధీనంలోకి తీసుకున్నారు. సంబంధిత భూమిలో చల్లా వసంత, ఇతరులు హైకోర్ట్ నందు రిట్ పిటిషన్ వేయగా సదరు కోర్ట్ వారు సదరు చల్లా వసంత, ఇతరులను దేవాదాయ చట్టం సెక్షన్ 83 ప్రకారము మాత్రమే తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్ట్ వారి ఉత్తర్వులను అనుసరించి దేవస్థానం ప్రత్యేక న్యాయవాది ఎన్.వి.ఎస్. ప్రసాద్ వర్మ వారి సూచనలను అనుసరించి చల్లా వసంత, ఇతరులపై దేవాదాయ శాఖ చట్టం 83 ప్రకారము నోటీసులు జారీ చేసి, తదుపరి వారు దేవస్థానం స్థలం నుండి వైదొలగనందున వారికి తుది ఉత్తర్వులు జారీ చేయుట జరిగింది. కాని వారి నుండి ఎటువంటి స్పందన లేనందున, హైకోర్ట్ వారి ఉత్తర్వులను అనుసరించి సదరు తోటను కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాద రావు వారి ఆధ్వర్యంలో కార్యనిర్వాహక ఇంజినీరు బి.రాంబాబు, డిఇ డి.వి.యస్. రామరాజు (హరి), సహాయ కార్యనిర్వహణా ధికారి వి.బి.ని.రమణమూర్తి స్వాధీనం చేసికొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సదరు స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం స్థలం యొక్క ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం 50 కోట్లు ఉంటుందని అధికారులు అంటున్నారు. దేవస్థానం స్పెషల్ లీగల్ సెల్ అడ్వకేట్ ఎన్.వి.ఎస్.ప్రసాద్ వర్మను కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాదరావు అభినందించారు.

శంకర్ ఫౌండేషన్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - పెందుర్తి: నాణ్యమైన కంటి సేవలతో సమాజానికి సేవలందిస్తున్న నాయుడు తోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో శనివారం జరిగిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విశాలమైన పచ్చటి క్యాంపస్‌లో గత వారం రోజులుగా శంకర్ ఫౌండేషన్ ఉద్యోగులకు క్రికెట్, బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, తగ్గఫ్ వార్, పాటల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు ఉత్సా హంగా నిర్వహించినట్లు హాస్పిటల్ డి.జి.ఎం. (పీఆర్) కే.బంగార్రాజు తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు అతిథులతో బహుమతులు అందజేసినట్లు చెప్పారు. శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ తన సందేశంలో ఉద్యో గులకు, విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ విజేతలకు అభినందనలు తెలియజేశారు. ముగింపు కార్యక్రమానికి శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కే.రాధాకృష్ణన్ ముఖ్య అతిధిగా పాల్గొని డాక్టర్ అజయ్ శర్మ, డాక్టర్ నస్రీన్, డాక్టర్ శిరీష, తదితర డాక్టర్లు సమక్షంలో పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు, విద్యా ర్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కే.రాధాకృష్ణన్ మాట్లాడుతూ అంధత్వ నివారణలో సమాజానికి శంకర్ ఫౌండే షన్ చేస్తున్న సేవలను వివరించారు. 2024వ సంవత్సరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసు పత్రిలో అనేక మౌలిక సదుపాయాలు సమకూర్చి కంటి రోగులకు అత్యాధునిక వైద్య సదు పాయాలు సత్వర నాణ్యమైన కంటి సేవలను నిర్వహించి సమాజ సేవకు అంకితమైనదని తెలిపారు. 2024వ సంవత్సరంలో లక్షా, 96 వేల148 మంది ఔట్పేషెంట్స్ కు కంటి పరీక్షలు,33 వేల 175 మందికి కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించామని అయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, డాక్టర్ సుపర్ణ, డాక్టర్ మమత మయి, డాక్టర్ కేవి సత్యనారా యణ, వి.రమేష్ కుమార్, డిజిఎం, వేణుగోపాల్, డిజిఎం కనకరాజు, ఏజిఎం మేనేజర్ శాస్త్రి, మూర్తి, డాక్టర్లు, అధిక సంఖ్యలో సిబ్బంది, విద్యార్థులు, మహిళా ఉద్యోగులు సాంప్రదాయ వస్త్రధారణలు ధరించి, ఉల్లాసంగా, ఉత్సాహంగా సంక్రాంతి వేడుకలను తిలకించారని బంగార్రాజు చెప్పారు.

కైలాసగిరిపై వీఎంఆర్డీఏ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు



విశాలాంధ్ర - విశాఖ: పర్యటక రంగంలో విశాఖకే మణిహారంగా నిలిచే కైలాసగిరి పర్యాటక ప్రాంతంలో వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎంవి ప్రణవ్ గోపాల్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కైలాస గిరిపై సందర్శకులు, పర్యాటకులతో మాట్లాడి అక్కడ కల్పించాల్సిన వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీరు అందు బాటులో ఉండేలా చూడాలని, సందర్శకుల సూచనల మేరకు పారిశుద్ధ్యం మెరుగ్గా నిర్వహించాలని సిబ్బందికి సూచిం చారు. సందర్శకుల సౌలభ్యం కోసం ఇటీవల ఏర్పాటు చేసిన బ్యాటరీ కార్ల నిర్వాహకులు వీఎంఆర్డీఏ నిర్దేశించిన ధరల కంటే ఎక్కువ వసూలు చేస్తున్నందుకు వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. వ్యాపారులు ఎవరైనా నిర్దేశించిన రుసుముల కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో భాగంగా కైలాసగిరి సందర్శనకు వచ్చిన ఆశ్రమం చిన్నారులతో ఆయన కొంతసేపు ముచ్చటించారు. కొంతమంది చిన్నారులను తన సొంత ఖర్చుతో సర్క్యులర్ రైల్‌లో తీసుకువెళ్ళారు. దీంతో చిన్నారులు సంతోషించి చైర్ పర్సన్ ప్రణవ్ గోపాల్‌కు ధన్యవాదాలు చెప్పారు. ఈ క్షేత్ర స్థాయి పర్యటనలో ఆయనతో పాటు జాయింట్ కమిషనర్ కె.రమేష్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు

ఎన్ఎస్ఆర్ఐటిలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని సొంట్యాం ఎన్ఎస్ఆర్ఐటి కళాశాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా వివిధ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంభు ప్రసాద్ మాట్లాడుతూ మన సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన కోఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతి, కళాశాల సెక్రటరీ ప్రసాదరాజు, డాక్టర్ వి.సుబ్బరాజు పాల్గొన్నారు.

మజ్జి కుశల్ జ్ఞాపకార్థం షటిల్ టోర్నీ

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 60వ వార్డులో గుల్లలపాలెం జీవీఎంసీ క్రీడా ప్రాంగణంలో ఇండస్ట్రియల్ జోన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ "ఏ" గ్రూపు వారి నేతృత్వంలో మజ్జి కుశల్ జ్ఞాపకార్థం శనివారం సంక్రాంతిని పురస్కరించుకొని షటిల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి సంజయ్ ప్రేమ్, రెండవ బహుమతిగా రవితేజ, నాగిరెడ్డి, మూడో బహుమతిగా మజ్జి రమేష్, రమణ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్లు మాట్లా డుతూ క్రీడల్లో ప్రతిభను చాటిన ప్రతి ఒక్కరు మరింతగా పార్లమెంట్లో రాణించాలని, మరిన్ని టోర్నమెంట్‌లో వారి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అనంతరం మజ్జి రమేష్ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో తమ ప్రతిభను కనబరుచుకొని మరిన్ని పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకొని ఇండస్ట్రియల్ జోన్‌కి మంచి పేరు సంపాదించుకోవాలని అన్నారు. షటిల్ టోర్నమెంట్ బహుమతులు ప్రధానోత్సవంలో ఇండస్ట్రియల్ బ్యాడ్మింటన్ జోన్ అసోసియేషన్ హానరబుల్ ప్రెసిడెంట్ కోటి మన్మధరావు, సీనియర్ బ్యాడ్మింటన్ ప్లేయర్, సెక్రటరీ అశోక్, జాయింట్ సెక్రెటరీ మజ్జి రమేష్, క్యాషియర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోయవీధిలో మంచినీటి బోరు ప్రారంభం

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జోన్ 3వ వార్డు బోయవీధిలో కార్పొరేటర్ నిధులతో మంజూరైన మంచినీరు బోర్‌ను గ్రామ పెద్దలు కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు శనివారం సంయుక్తంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ మున్సిపల్ కుళాయిలు వస్తున్నప్పటికీ బోయవీధి గ్రామంలో త్రాగునీరు సమస్య ఉందని అన్నారు. త్వరలో బోయవీధి గ్రామానికి శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కారం కోసం 3వ వార్డు కార్పొరేటర్ పైలెట్ వాటర్ స్కీమ్ మంజూరు చేయుటకు హామీ ఇచ్చారని అన్నారు. అదే జరిగితే మా గ్రామానికి ఇక మంచినీటి సమస్య ఉండదని అన్నారు. ఈ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకి, కార్పొరేటర్ గంటా అప్పలకొండకు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కాసరపు నాగరాజు, కొక్కిరి నూకరాజు, వాడమొదలు కృష్ణ, కొక్కిరి అప్పన్న, కాసరపు ఎల్లాజీ, తెడ్డు పెద గొల్లయ్య, చిన్న గొల్లయ్య, తెడ్డు సింహాద్రి పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ సీఈవోకి సత్కారం

విశాలాంధ్ర - విశాఖ: నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీవీఆర్ సుబ్రహ్మణ్యంని వీఎంఆర్డీఏ చైర్మెన్ ఎంవి ప్రణవ్ గోపాల్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో గత మూడు రోజులుగా నీతి ఆయోగ్ గ్రోత్ ఇంజిన్స్‌పై సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పర్యాటక రంగానికి చెందిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మెట్రోపాలిటన్ కమీషనర్ కె.ఎస్.విశ్వనాథన్, సంయుక్త కమిషనర్ కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు జడ్జి

విశాలాంధ్ర - సాగర్‌నగర్: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర ఆలయంలో (టిటిడి) శనివారం సుప్రీంకోర్టు జడ్జిలు అరవింద్ కుమార్, కె.విశ్వనాధన్ కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద పూజలు నిర్వహించి, శ్రీవారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టిటిడి పండితులచే వేదాశీర్వాదం తీసుకున్నారు. వీరికి ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు శ్రీవారి ప్రసాదాన్ని అందించారు.

షర్మిల చుట్టూ కొత్తకోటరి

పాత క్యాడర్‌ను పక్కన పెట్టిన వైనం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కాంగ్రెస్ పార్టీలో అన్ని కొత్త ముఖాలే కనిపిస్తున్నాయి. జిల్లాలో పాత క్యాడర్‌ను పిసిసి చీఫ్ షర్మిల రెడ్డి పక్కన పెట్టారనే వాదన వినిపిస్తోంది. ఎన్నో ఏళ్లుగా పార్టీ పట్ల అభిమానంతో కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వారందరూ ఇప్పుడు కార్యక్ర మాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం పార్టీలో వివిధ పదవుల్లో ఉన్న వారంతా వైసిపితోపాటు వివిధ పార్టీల నుంచి వచ్చినవారే వున్నారు. గతంలో షర్మిల రెడ్డి పాదయాత్ర సమయంలో ఆమె వెంట ఉన్న వారేనని, వీరంతా ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు పెత్తనం చేస్తు న్నారని కాంగ్రెస్ కార్యకర్తలు వెల్లడిస్తున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ చతికిలపడింది. 11 సీట్లకే పరిమితమైంది. ఈ తరుణంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేం దుకు మంచి అవకాశం ఉంది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సోదరి వైఎస్ షర్మిల రెడ్డి ప్రస్తుతం పీసీసీ చీఫ్‌గా కొనసాగుతున్నారు. ఎవరు చేయలేని విమర్శలు గుప్పిస్తూ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. రాష్ట్రంలో ఆమె చేస్తున్న విమర్శలు చర్చనీ యాంశం అవుతున్నాయి. వైసీపీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్లను వెనక్కి రప్పించే ప్రయత్నం చేస్తే పార్టీకి పూర్వ వైభవం వస్తుందని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా పార్టీని నమ్ముకున్న వారినే దూరం పెట్టిన షర్మిల ఇక కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి దృష్టిసారిస్తారా అనే అనుమానం వ్యక్తం అవుతోంది. పిసిసి, డిసిసితోపాటు అనుబంధ సంఘాల్లో కీలకంగా పనిచేసిన వారంతా పార్టీకి దూరంగానే ఉన్నారు. విశాఖ వచ్చిన షర్మిల వారిని కలిసే ప్రయత్నం, మాట్లాడే ప్రయత్నం గాని చేయలేదు. పార్టీలోనే ఉంటూ స్తబ్దతగా ఉన్న వార్ని కలుపుకుపోయే ప్రయత్నం చేయకపోవడం విమర్శలకు తావిస్తుంది. సీనియర్ లు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పోటీ చేసిన తమని పట్టించుకోలేదని, ఎన్నికల తర్వాత అందర్నీ దూరం పెట్టారని, పార్టీ కోసం కష్టపడి, లక్షలు ఖర్చుపెట్టిన తమని దూరం పెట్టిడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ స్థాయి పార్టీ అయిన కాంగ్రెస్, బిజెపికి ప్రత్యామ్నా యంగా కేంద్రంలో పోరాటం చేస్తుంటే రాష్ట్రస్థాయిలో పార్టీని నిద్రావస్థకు తీసుకువెళ్తున్నారని కాంగ్రెస్ కేడర్ ఆవేదన చెందుతున్నారు.

సమాజ అభివృద్ధిలో మహిళలు ముఖ్య భూమిక

విశాలాంధ్ర -విశాఖపట్నం: మహిళలు సమాజాభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించడం అందరికీ గర్వకారణమని మాజీమంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ లేడీస్ కమిటీ, సన్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో సన్ ఇంటర్నేషనల్ వైజాగ్ విస్టా లేడీస్ గోల్ఫ్ కప్ 2025 పోటీలను శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు గోల్ఫ్ కోర్టులో తమదైన ప్రతిభను చాటాలని అభిలాషించారు. దేశ రాష్ట్రపతి నుంచి అనేక రంగాల్లోని మహిళలు తమ శక్తిని నిరూపిస్తున్నారు అన్నారు. ఇటువంటి క్రీడల ద్వారా మరింత ఉత్సాహంగా జీవితంలో రాణించేందుకు అవకాశం కలుగుతుంది అన్నారు. సన్ ఇంటర్నేషనల్ సీఎండీ శ్రీకాంత్ జాస్తి మాట్లాడుతూ సన్ ఆధ్వరంలో మహిళలకు ఈ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల ద్వారా వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే అవకాశం కలుగుతుంది అన్నారు. మహిళలు అన్ని రంగాల్లోని విజయం సాధించాలని ఆకాంక్షించారు. సన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి మాట్లాడుతూ విద్యార్థులకు అనేక మెలుకువలు నేర్పుతూనే సమాజ అభివృద్ధికి తాము ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళలు శక్తిగా ఉంటేనే ఆయా కుటుంబాలు సైతం దృఢంగా నిలబడతాయి అన్నారు. పోటీల అనంతరం విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

నా క్లయింటు: విశాఖ జిల్లా MVP కాలనీకి చెందిన శ్రీమతి బండి వెంకటలక్ష్మి w/o బండి వీరభద్రరావు గారికి నేపాల్ కృష్ణదాస్ గారి వలన మధురవాడ సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రీ కాబడిన దస్తా వేజు నెం: 2677/2022 క్రయ దస్తావేజు యొక్క లింకు దస్తావేజు నెం.1347/1994ను MVP కాలనీ - VMRDA ఆఫీసు మార్గ మధ్యలో ఒరిజినల్ దస్తావేజు పోయినది. పై దస్తావేజు దొరికిన యెడల విశాఖ జిల్లా గ్రేటర్ విశాఖపట్నం చేరిన డో.నెం.1-94-4/2రు, గిరిజన భవన్ దరి ఎంవీపీ కాలనీ, విశాఖ పట్నం-17 అడ్రసు నందు అందజేయగలరు.

ఎస్.సంతోష్‌కుమార్,
MA, MA, LLB అడ్వకేట్, విశాఖపట్నం,
9908077967

కూడారీ ప్రసాదం నివేదన

విశాలాంధ్ర - భీమిలి: ధనుర్మాసం సందర్భంగా శ్రీ ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో స్వామి వారికి విశేషమైన అక్కరడిషల్ (కూడారై) ప్రసాదం నివేదన జరిగింది. భీమిలి పరిసర ప్రాంత మంది భక్తులు స్వామి వారిని దర్శించి, కూడారీ ప్రసాదం సేవించి, స్వామి వారి అనుగ్రహం పొందారు. ఈ కార్యక్రమం ఆలయ అర్చకులు పురాణం శేషా శేషాచార్యులు, విష్ణు వారి పర్యవేక్షణలో జరిగింది. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కలిగొట్ల సూర్య నారాయణ మూర్తి, కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, హరినాథ్రెడ్డి, శర్మ, వి.తాతాజీ పాల్గొన్నారు.

బస్సు నుంచి జారిపడి బాసర విద్యార్థిని మృతి

విశాలాంధ్ర - పద్మనాభం: గొల్లల కుసులవాడ గ్రామానికి చెందిన కొండ్రు భరణి అనే విద్యార్థిని ఏనుగుల పాలెం గ్రామం

వద్ద ప్రమాదవశాత్తు ఏపీ31టిబి9465 బస్సులో నుంచి జారి పడి గాయాల పాలయింది. ఆమెను హుటా హుటిన అదే స్కూలు బస్సులో గాయత్రి ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందింది. పద్మనాభం పోలీసు సిహెచ్ శ్రీధర్ ఇచ్చిన వివరాలు మేరకు ఆమె తగరపువలస, బాసర కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతుందని, కొండ్రు భరణి (17) తండ్రి పేరు కొండ్రు అప్పారావుగా తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కుంతి మాధవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభంలో వెలసిన శ్రీ కుంతీ మాధవ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ అనంత పద్మనాభ స్వామి. ఉత్సవ విగ్రహాలను. పలు రకాల పుష్పాలతో అలంకరించి. పంచామృత అభిషేకం. విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అలాగే ఉత్సవ మూర్తులను గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కె రాంబాబు, రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి జి వెంకటలక్ష్మి, రాష్ట్ర బిజెపి వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి పెద్ద ఎర్రి నాయుడు, ఆలయ ఈవో నానాజీ బాబు, గ్రామ సర్పంచ్ తాలాడ పావ పద్దు, ఎంపీటీసీలు కే లక్ష్మి, బోని సావిత్రి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సింహాచలంలో శ్రీ నిర్మలా నృత్య నికేతన్ విద్యార్థుల నృత్య సేవ

విశాలాంధ్ర - పెందుర్తి : వైకుంఠ ఏకాదశి పర్వదినాన సింహాద్రి నాథుని ఉత్తర ద్వార దర్శన మహా పుణ్యకాలంలో చిన్న ముసిడివాడకు చెందిన ప్రముఖ నాట్య విద్యాలయం శ్రీ నిర్మల నృత్య నికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యసేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రహ్లాద పట్టాభిషేకం నృత్య రూపకం అలరించింది. ఈ రూపకాన్ని ప్రదర్శించిన కళాకారులు శర్వాణి దేవి, సాహితికృష్ణ, రేణుక సాయిలను పలువురు అభినందించారని నృత్య నికేతన్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ జ్యోతి తెలిపారు. దేవదేవుని సన్నిధిలో తమ విద్యార్థుల ప్రదర్శనకు అభినందనలు రావడం సంతోషంగా ఉందని ప్రిన్సిపల్ తెలియజేశారు.

ఘనంగా కార్పొరేటర్ ముమ్మన దేముడు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి : బిజెపి సీనియర్ నాయకుడు జీవీఎంసీ 95 వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు బిజెపి నాయకులు కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. సుజాతనగర్ సమీపంలోని రత్నగిరినగర్ లో గల ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో ముమ్మన సన్యాసిరావు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, అకార్ బాలికలతో కలిసి కేక్ కటింగ్ చేసి పిల్లలకు తినిపించారు. అనంతరం ఆకార్ బాలిక సంరక్షణ కేంద్రంలో ఉన్న పిల్లలకు అల్పాహారం వడ్డించారు. కార్యక్రమంలో (చినముషీడివాడ మండలం)బిజెపి 95,97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్,బీజేవైఎం పెందుర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకాంత్,బీజేవైఎం విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డు గురునాథ్,ప్రసాద్, వెంకటేష్,కంచిబోయిన సంతోష్,కొత్తపల్లి అప్పలరాజు,రాపర్తి దుర్గాప్రసాద్,కె. మాధవి,కెవిఆర్.లక్ష్మి,చిట్టి భవాని,తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

విశాలాంధ్ర - అనందపురం: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ప్రతిఏటా నిర్వహించే క్రికెట్ పోటీలు ఆనందపురం మండలంలో బంటుపల్లి గ్రామపం చాయతీలో ఈ ఏడాది కూడా నిర్వహించారు. ఈ పోటీలను శనివారం ఆనందపురం సిఐ సిహెచ్.వాసు నాయుడు ముఖ్య అతిథిగా హాజరై క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శరీర మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ముఖ్యమని ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనాలని అన్ని రంగాలతో పాటు క్రీడారంగంలో కూడా ప్రతిభ కనబరచాలని తెలిపారు. ప్రతి సంవత్సరం లాగా ఈ ఏడాది కూడా కూడా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దుర్గా,రాణా తెలిపారు. ఈ క్రికెట్ పోటీలకు విరాళాలు అందించిన స్థానిక సర్పంచ్ కోన శ్రీను పైడిరాజు, భీమిలి నియోజకవర్గం కూటమి పార్టీనాయకులు బంటుపల్లి శ్రీనివాసరావు, బంటుపల్లి సాధురావును సిఐ అభినందించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ చందక అప్పలరాజు, క్రీడాకారులతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కోసం మెగా ఈవెంట్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, వాటిని నివారించడానికి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మాజీ రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. జీవీఎల్ మహా సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం ఆర్థిక అక్షరాస్యత , సైబర్ భద్రతపై మెగా ఈవెంట్ ప్రారంభించనున్నామన్నారు. విశాఖపట్నంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయని జీవీఎల్ నరసింహారావు ఆందోళన వ్యక్తం చేశారు. గత సంవత్సరం విశాఖపట్నంలో సైబర్ నేరస్థులు రూ.115 కోట్లు దోచుకోగా, కొత్త సంవత్సరం మొదటి 10 రోజుల్లోనే సామాన్యులు రూ.10 కోట్లు కోల్పోయారన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి, అలాంటి సైబర్ నేరాలను నివారించడానికి, ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సైబర్ భద్రతపై మెగా ఈవెంట్ జరుగుతుందన్నారు. ఉదయం 10:30 గంటలకు ఆర్ బిఐ సీనియర్ అధికారులు, ప్రధాన బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల అధికారుల సమక్షంలో ప్రారంభమవుతుందన్నారు.

గిరీష్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గిరీష్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. రైతుల వేషధారణ, బసవన్న, హరిదాసు, వెంకటేశ్వర స్వామి గోదాదేవి వేషధారణలో విద్యార్థులు అలరించారు. విద్యార్థినిలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి మరియు పాల్గొన్న వారికి బహుమతులు ప్రధానం చేశారు. సంక్రాంతి పండుగ విశిష్టతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీమ రెడ్డి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థినులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వెంకటాద్రి వాసునికి కూడారా ప్రసాదం నివేదన

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతి పెందుర్తి వెంకటాద్రిపై ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా శనివారం విశేష పాశురాం, స్వామివారికి కూడారై ప్రసాదం అర్చకులు నివేధన చేశారు.108 వెండి గిన్నెలలో ప్రసాదాన్ని స్వామివారికి నివేదించారు. ఆలయ ప్రధాన అర్చకులు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో పండితులు ఉదయం స్వామివారిని మేల్కొల్పి, తనయ విన్నపం చేసి హారతి చేశారు. సేవకాలం, శాత్తుమొరై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, ప్రసాదాలు స్వామి వారికి నివేధన చేసారు. భక్తులకు తీర్ధ గోష్ఠి ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం తిరువీధుల్లో గోదా అమ్మవారిని ఊరేగిస్తామని, సాయంత్రం 5 గంటలకు పెందుర్తి జంక్షన్ నుండి బయలుదేరి ఊరేగింపుగా స్వామివారి సన్నిధికి చేరుకుంటామని రామానుజాచార్యులు తెలియజేశారు.

కోడిపందేలు, పేకాటకు నో పర్మిషన్... డ్రోన్లతో నిరంతరం ప్రత్యేక నిఘా... ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు..

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో పందెం రాయుళ్లు, పేకాట బాబులు పెరిగిపోతున్నారు. దానికి ఉదాహరణ శుక్రవారం రామవరం - గండిగుండంలో జరిగిన కోడిపందేలు నిర్వహణ, పట్టు పడ్డ వారిపై కేసుల నమోదు చేసినప్పటికీ కూడా ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. అందులో భాగంగా విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంకర బ్రత భాగ్చి ఆనందపురం మండలం పై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలుస్తుంది. ఎలాగైనా ఈ శిబిరాలపై ఉక్కు పాదం మోపాలని నూతన సాంకేతికతతో శనివారం కొండ పరిసర ప్రాంతాలైన దుక్కవానిపాలెం, గోరింటా, పల్లిపేట కొన్ని గ్రామాల్లో డ్రోన్లతో జూదా రాయులపై ప్రత్యేకంగా పెట్టారు. ఇవి ఇకనుండి పగల రాత్రి తేడా లేకుండా తిరుగుతాయని ఎవరైనా కోడిపందాలు గానీ పేకాట నిర్వహిస్తున్నట్లు వారి యొక్క చిత్రాలను ధ్రువీకరించి తక్కువ సమయంలో వారిని గుర్తించి పట్టుకునేందుకు అవకాశం ఉంటుందని అందుకే ఈ డ్రోన్ కెమెరా పరిజ్ఞానాన్ని సిపి ఆదేశాల మేరకు మొదటిసారిగా అనందపురం మండలంలో ఎగరవేశామని ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ చింతా వాసునాయుడు తెలిపారు. కొంతమంది వ్యక్తులు అనుమతులు ఉన్నాయని తప్పుడు ప్రసారంతో నిర్వహణ చేసి జనాలను మభ్యపెడుతున్నారని అదంతా కూడా అబద్ధమని ఎవరైనా నిర్వహిస్తే చట్ట పరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి, అమలు చేస్తూ అవగాహన కొరకై ప్రజలకు, ఉత్పత్తి, సరఫరా, వ్యాపార, వినియోగదారులకు ఇప్పటికే అవగాహన కల్పించినట్టు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ "సే నో టు ప్లాస్టిక్" స్టిక్కర్లను అతికించే కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ సిబ్బందికి జూమ్ యాప్ ద్వారా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ఉపయోగించుకునే ప్రత్యామ్నాయ వస్తువులు, నియమ నిబంధనలు, వాటి వివరాలను స్టిక్కర్ల క్యూఆర్ కోడ్‌లో పొందుపరచడమైనదని ప్రతి వ్యాపార సంస్థకు ప్రత్యేకించి తెలియపరచాలని ఆదేశిస్తూ అవగాహన కల్పించామన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నియమాలు 2024, "సే నో టు ప్లాస్టిక్" హ్యాండ్‌బుక్ (తెలుగు వెర్షన్), సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా వినియోగించుకునే ప్రత్యామ్నాయ వస్తువులు సమాచారం, ఆమోదిత బయోడిగ్రేడబుల్ ఉత్పత్తుల తయారీదారుల జాబితా సమాచారం, పౌరులు, వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై తమ అభిప్రాయాలను పంచుకునేందుకుగానూ ఫీడ్‌బ్యాక్ ఫారం పొందుపరచడం వంటి వివరాలను అందుబాటులో ఉంచడం ద్వారా ప్రజలందరూ సులభంగా సమాచారం తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమం ఒక్క రోజులో నిర్వహించడం ద్వారా నగరంలో ప్రజలకు, వ్యాపార వాణిజ్య సంస్థలకు అవగాహన కల్పించిన నిమిత్తమై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుపై ప్రభావవంతమైన, చైతన్యపూర్వకంగా సామూహిక అవగాహన కార్యక్రమం ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్లాస్టిక్ రహిత విశాఖ నగర అభివృద్ధికై బలమైన సంకల్పాన్ని ప్రతిఫలింపజేస్తూ జీవీఎంసీ నిర్వహించడమైనదన్నారు. సే నోటు ప్లాస్టిక్ స్టిక్కర్లలో క్యూఆర్ కోడ్ ద్వారా పొందుపరిచిన సమాచారాన్ని నగర ప్రజలందరూ తెలుసుకునేందుకు జీవీఎంసీ వెబ్సైట్ నందు కూడా పొందుపరుస్తున్నామన్నారు.

పోషకాల బాదంతో విభిన్న తరహా వంటకాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశం అంతటా ప్రస్తుతం పంట కోత కాలాన్ని ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారని, మకర సంక్రాంతి, దక్షిణాన పొంగల్, ఇతర ప్రాంతాలలో లోహ్రీ, బిహు లేదా బైసాఖి వంటి వివిధ పేర్లతో జరుపుకునే ఈ పండుగలో బాదం తరహా పోషకాహారాన్ని భాగం చేయాల్సిందిగా మ్యాక్స్ హెల్త్‌కేర్, డైటెటిక్స్ రీజినల్ హెడ్ రితికా సమద్దర్ ఫిట్‌నెస్ మాస్టర్, పిలేట్స్ బోధకురాలు యాస్మిన్ కరాచీవాలా, న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి పిలుపునిచ్చారు. కాలిఫోర్నియా ఆల్మండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అత్యంత ప్రజాదరణ పొందిన బాదం అయిన కాలిఫోర్నియా బాదంలను చేర్చడం ద్వారా పండుగ విందుకు ఆరోగ్యకరమైన మలుపును అందిద్దామన్నారు. డ్రై ఫ్రూట్స్ రాజుగా, కాలిఫోర్నియా బాదంలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఆహార ఫైబర్, విటమిన్లు మరియు ఖనిజాలు సహా 15 ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయని, ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయన్నారు. భారతదేశంలో మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధుల ప్రాబల్యం పెరుగుతున్నందున ఆహార ఎంపికల పట్ల జాగ్రత్త వహించడం కూడా ముఖ్యం. కాలిఫోర్నియా బాదంలను రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల బరువు నిర్వహణకు కూడా తోడ్పడుతుందన్నారు. వాటి అధిక ఫైబర్ కంటెంట్ తో ఇది సాధ్యమవుతుందని, విటమిన్ ఈ, ఇనుము, మెగ్నీషియం, ఫైబర్, ప్రోటీన్ మరియు జింక్‌తో సమృద్ధిగా ఉన్న బాదం గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర నియంత్రణ, బరువు నిర్వహణ మరియు మొత్తం శ్రేయస్సుకు మద్దతు ఇస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడానికి కూడా సహాయ పడతా యన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ - నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఐసిఎంఆర్-ఎన్ఐఎన్) ఇటీవల ప్రచురించిన భారతీయుల ఆహార మార్గదర్శకాలు బాదంను మంచి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ తినగల పోషకమైన గింజగా బాదమును గుర్తించాయని చెప్పారు.

భార్య వేధింపుల నుంచి కాపాడండి: అంధ ఉద్యోగి ఆవేదన

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తన భార్య వేధింపుల నుంచి తనకు రక్షణ కల్పించాలి అని వీఎమ్మార్డీఏ ఉద్యోగి శ్రీధర్ కోరారు. తాను దివ్యాంగుల కోటాలో వి ఎం ఆర్ డి ఏ సంస్థలో ఉద్యోగం చేస్తున్నానని తెలిపారు. వీజెఎఫ్ ప్రెస్ క్లబ్లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు 75 శాతం అంధత్వం వుందని మధ్యవర్తులకు ముందుగానే చెప్పి 2006లో కొత్తవలసకు చెందిన వెంకట పద్మను వివాహం చేసుకున్నానని తెలిపారు. నగరంలోని హెచ్‌బి కాలనీలో గల తన తల్లిదండ్రులతో కలిసి నివాసం వుంటున్నానన్నారు. తన తల్లి స్టీల్ ప్లాంట్‌లోనూ, తండ్రి కామేశ్వరరావు డాక్ యార్డులో ఉద్యోగాలు చేస్తున్నారు అని తెలిపారు. కాగా, 2007 జనవరిలో తన భార్య పద్మ గర్భవతి అయిన తరువాత అన్నయ్య చెప్పాడు అన్న నెపంతో అబార్షన్ చేయించుకుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె అన్నయ్య సిఆర్‌పిఎఫ్‌లో కానిస్టేబులుగా పనిచేస్తున్నారన్నారు. 2008లో తనకు కుమార్తె జన్మించారు అన్నారు. భర్త, అత్త మామలు వేధిస్తున్నారంటూ తన కుటుంబ సభ్యుల మీద తన భార్య ఫిర్యాదు చేసి కోర్టులో కేసు వేశారు అన్నారు. కానీ న్యాయమూర్తి కేసు కొట్టి వేస్తూ 2012లో తీర్పు చెప్పారు అని తెలిపారు. తన భార్య పద్మ 2020లో కోర్టులో తన మీద మరో సారి కేసు వేసిన తనకు తీర్పు అనుకూలంగా వచ్చింది అన్నారు. తన ఇంట్లో 12 తులాల బంగారాన్ని మాకు తెలియకుండా వాళ్ళ అన్న ద్వారా బ్యాంకులో తాకట్టు పెట్టింది అన్నారు. తనకు 40 లక్షలు భరణం ఇవ్వాలని, లేకుంటే వి ఎం ఆర్ డి ఏ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసిందన్నారు. కొత్తవలసలో కాపురం ఉండాలని పేచి పెడుతుందని, అక్కడినుంచి నేను అప్ అండ్ డౌన్ చేయడం కష్టమన్నారు. ఇప్పటి వరకు తన భార్య పద్మ తన మీద నాలుగు సార్లు హత్యాయత్నం చేసిందన్నారు. భరణం కింద నెలకు 12 వేలు నుంచి 20 వేల వరకు నుంచి వరకు ఇస్తున్నానని చెప్పారు. ఆమె తనకు రక్షణ కల్పించాలని కోరారు. మీడియా సమావేశంలో శ్రీధర్ తండ్రి కామేశ్వరరావు, తల్లి హైమావతి, మధ్యవర్తులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భయం ఎరుగని వడ్డెర్లు, బోయలు మరియు చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని, సమర్థవంతంగా నడిపించి, దట్టమైన నల్లమల అడవుల్లో సైతం, కుంఫనీ సైన్యాన్ని ఊచకోత కోసి ఉరుకులు పెట్టించడంలో ముఖ్య పాత్ర పోషించిన వీరుడు వడ్డే ఓబన్న అని జీవీఎంసీ అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జీవీఎంసీ అధికారులతో కలిసి వడ్డే ఓబన్న జన్మదిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డే ఓబన్న జనవరి 11న రేనాటి ప్రాంతంలో జన్మించారని, ఆయన జన్మదినోత్సవాన్ని రాష్ట్ర వేడుకగా రాష్ట్రమంతా జనవరి 11న నిర్వహిస్తుందని తెలిపారు. ఓబన్న సంచార జాతి వడ్డెర కులానికి చెందిన వారని, బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీన సమయంలో, రేనాటి పాలేగాళ్లకు అధికారాన్ని, కుంఫనీకి ఇచ్చినందుకు పాలెగాళ్లకు ఇచ్చే భత్యం విషయంలో ప్రారంభమైన ఘర్షణలు, క్రమేపీ సాయుధ పోరాటాలుగా మారాయని తెలిపారు. నొస్సం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరులో సైన్యాధ్యక్షుడిగా వడ్డే ఓబన్న పోషించిన వీరోచిత పాత్రను, చరిత్రలో తక్కువ చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. నరసింహా రెడ్డికి ముఖ్య అనుచరుడిగా, తన నాయకుడిని మరియు అతని కుటుంబాన్ని కూడా కాపాడటంలో ముఖ్య పాత్ర పోషించిన వడ్డే ఓబన్న వీరత్వాన్ని తక్కువచేయడాన్ని, ఈ రోజు వడ్డెర జాతి మాత్రమే కాదు, సభ్య సమాజం మొత్తం చాలా ప్రాధాన్యంగా తీసుకుందన్నారు. కనీసం ఇప్పటి నుండైనా, స్వతంత్ర వీరుడు వడ్డే ఓబన్నకు తగినంత గుర్తింపు లభిస్తే, సంచార జాతి వడ్డెర కులానికే కాదు, బడుగు బలహీన వర్గాలందరికీ సంఘంలో గౌరవం లభిస్తుందని భావించి, జనవరి 11న వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా రాష్ట్ర మంతటా జరుపుకుంటున్నామన్నారు. తద్వారా ఆ జాతికి తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ జోనల్ కమిషనర్ ఎం.వి.డి.ఫణిరామ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలనాయుడు, అసిస్టెంట్ ఇంజనీర్ ఆనంద్, పర్యవేక్షకులు రియాజ్, జీవీఎంసీ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన రోడ్లు..

ట్రాఫిక్ పోలీసులకు తలనొప్పిగా మారిన ఆనందపురం జంక్షన్... ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి పహారా...

విశాలాంధ్ర - ఆనందపురం: సాధారణ సమయంలో ఆనందపురం జంక్షన్ గుండా ప్రయాణాలు సాగించాలంటే వాహనదారులకు కొద్దిమేర కష్టం. అటువంటిది పండగ సమయంలో అయితే ఇంకా చెప్పనవసరం లేదు. సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రద్దీ పెరిగిపోవడంతో ఆనందపురం ట్రాఫిక్ పోలీసులకు తరచు తీవ్రమైన ఇబ్బందులు గురవుతున్నారు. శనివారం నుండే పండగ నిమిత్తం విద్యార్థులు ప్రజలు వారి సొంత ఊర్లకు వెళ్లే వారి సంఖ్య అమాంతంగా పెరిగిపోవడంతో ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తన సిబ్బందితో తెల్లవారి నుండే పటిష్ట ఏర్పాట్లు చేశారు. దానికి తోడు మార్కెట్ ప్రక్కనే ఉండటం వలన వచ్చే పోయే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. అనేకమార్లు ఈ సమస్యపై నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదు స్థానిక ప్రజలు అందించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు కోరుచున్నారు. తీవ్రమైన ట్రాఫిక్ సమస్య వలన ట్రాఫిక్ పోలీసులకు నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయని, నిరంతరం గస్తీ ఏర్పాటు చేసుకున్నప్పటికీ వాహనాల రద్దీ ఎక్కువ అవ్వడంతో ఎక్కువ సమయం రోడ్డుపైనే వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు ఇప్పటికైనా ఈ సమస్యకు ఒక పరిష్కారం ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బీచ్ రోడ్‌లో వైజాగ్ ఎక్స్ పో ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: కుటుంబం అంతటికి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే వేదికగా వైజాగ్ ఎక్స్ పో 2025 నిలుస్తుందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు అన్నారు. శనివారం సాయంత్రం బీచ్ రోడ్‌లోని సబ్ మెరైన్ మ్యూజియం ఎదురుగా ఏర్పాటు చేసిన వైజాగ్ ఎక్స్ పో 2025 ను ప్రారంభించారు. వినోదానికి వేదికగా విశాఖ నగరం నిలుస్తుందని అన్నారు కొండపల్లి బొమ్మలతో తయారుచేసిన ప్రధాన గేట్ ఎంతో ఆకర్షణీయంగా ఉందన్నారు సంక్రాంతి పండుగను విశాఖవాసులు జరుపుకోవడానికి సరైన వేదికగా ఇది నిలుస్తుందని చెప్పారు. ఎగ్జిబిషన్లో ఏర్పాటుచేసిన వైవిధ్యమైన ఆట వస్తువులు, ఎంతో ప్రత్యేకమైన జలకన్యలు వంటివి చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరిని అలరిస్తాయని అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ కాశ్మీర్ నగరాన్ని నమునాగా తీసుకొని ఇక్కడ ఏర్పాటు చేసిన విధానం ప్రజలందరినీ ఆకట్టుకుంటుందని చెప్పారు. విశాఖ నగరంలో ప్రతీ సంవత్సరం సరికొత్త కాన్సెప్ట్ తో నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్ ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుందని చెప్పారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాజారెడ్డి మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి విశాఖ నగరంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా జలకన్యలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన హైలెట్ గా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బైరెడ్డి పోతన రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే తొలిసారిగా 286 కిలోమీటర్ల రిమోట్ రోబోటిక్ కార్డియాక్ సర్జరీ

విశాలాంధ్ర/విశాఖపట్నం: మన దేశంలో తొలిసారిగా స్వదేశీ సర్జికల్ రోబోటిక్ టెక్నాలజీ డెవలపర్ ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ కేవలం రెండు రోజుల్లో రెండు ప్రపంచ మొదటి రోబోటిక్ కార్డియాక్ టెలిసర్జరీలను విజయవంతంగా నిర్వహించింది. గురుగ్రామ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయాన్ని రాజస్థాన్‌లోని జైపూర్‌లోని మణిపాల్ ఆసుపత్రితో 286 కిలోమీటర్ల దూరం అనుసంధానం చేసి, ఈ విజయాన్ని సాధించింది. రిమోట్ ద్వారా నిర్వహించిన టెలీరోబోటిక్ అసిస్టెడ్ ఇంటర్నల్ మమ్మరీ ఆర్టెరీ హార్వెస్టింగ్ ప్రక్రియ 58 నిమిషాల్లో విజయవంతంగా పూర్తయింది. గురుగ్రామ్‌లోని ఎస్ఎస్ఐ ప్రధాన కార్యాలయం నుండి ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్.ఇంక్ వ్యవస్థాపకుడు, చైర్మన్, సీఈఓ డాక్టర్ సుధీర్ శ్రీవాస్తవ నేతృత్వంలో, జైపూర్‌లోని మణిపాల్ ఆసుపత్రి కార్డియాక్ సర్జరీ చీఫ్ డాక్టర్ లలిత్ మాలిక్, జైపూర్‌లోని మారుమూల ప్రదేశంలో తన నిపుణుల బృందంతో ఈ శస్త్రచికిత్స చేశారు. కేవలం 35-40 మిల్లీసెకన్ల (సెకనులో 1/20 వ వంతు) తక్కువ లేటెన్సీతో అసాధారణ ఖచ్చితత్వాన్ని ప్రదర్శించింది. ఆ తర్వాత దాని వెంటనే రోబోటిక్ బీటింగ్ హార్ట్ టోటల్ ఎండోస్కోపిక్ కరోనరీ ఆర్టరీ బైపాస్ (టీఈసీఏబీ) సర్జరీ చేయడం విశేషం.